క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



వెంకటాపురంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు/రూరల్: మండలంలోని వెంకటాపురం, బాపనంతాపురం తదితర గ్రామాల్లో శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారి, పద్మావతి అమ్మవార్ల కల్యాణం కమనీయంగా జరిగింది. సాయంత్రం అమ్మవారు, స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించారు. వెంకటాపురంలో జరిగిన కల్యాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శివశంకర రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, నాయకులు కుందూరు శివారెడ్డి, బాలస్వామి, రాజమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ చార్జీల భారం వేయొద్దు



మాట్లాడుతున్న పట్టణ కార్యదర్శి రణధీర్

ఆత్మకూరు: అదనపు విద్యుత్ చార్జీల భారం వేయొద్దని సీపీఐ పట్టణ కార్యదర్శి రణధీర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేయాలని ప్రజలను కోరారు. సమావేశంలో నాయకులు జఫీవుల్లా, సద్దాం, సురేంద్ర పాల్గొన్నారు.

మల్లన్న సేవలో మైనార్టీ శాఖ కార్యదర్శి



డాక్టర్ చంద్రశేఖర్ దంపతులకు స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను అందిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: మైనార్టీ శాఖ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ దంపతులు శనివారం శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం వారికి అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

ఆరడుగుల నాగుపాము



పామును పట్టుకున్న మోహన్

మహానంది: బుక్కాపురం గ్రామంలోని ఓ గుడిసె పైకప్పులో శనివారం ఆరు అడుగుల నాగుపాము కనిపించడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. వారు వెంటనే అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించడంతో అతడు అక్కడికి చేరుకుని పామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వరుసగా మూడోసారి ఎంపిక



అంబాల ప్రభాకర్‌రెడ్డి

వెలుగోడు: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా అంబాల ప్రభాకర్‌రెడ్డి వరుసగా మూడోసారి ఎంపికయ్యారు. దీంతో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనపై నమ్మకం ఉంచి మూడోసారి అధ్యక్షుడిగా ఎంపిక చేయడం తనపై మరింత భారం పెరిగిందని, నాయకులకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నాగరాజు

నందికొట్కూరు: పాములపాడు మండలం మిట్టకందాల గ్రామానికి లింగాల నాగరాజు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్యను పూలమాలలతో ఆయన సత్కరించారు. లింగాల స్వాములు ఎంపికపై ప్రజలు, కుల సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీగిరికి సంక్రాంతి శోభ

● పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ప్రారంభం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల ఆలయాన్ని దేవస్థానం అధికారులు సుందరంగా అలంకరించారు. ఆలయంలోని ధ్వజస్తంభం, స్వామిఅమ్మవార్ల ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఆలయ గోపురాలకు, గంగాధర మండపం వద్ద ప్రధాన ఆలయానికి ఎదురుగా స్వామిఅమ్మవార్ల చిత్రపటాలతో విద్యుద్దీకరణ, ఆలయంలో పుష్పాలంకరణ పలవురు భక్తులను ఆకట్టుకుంది. దీంతో శ్రీగిరి క్షేత్రం సంక్రాంతి శోభతో కళకళలాడుతుంది.



గంగాధర మండపం వద్ద స్వామిఅమ్మవార్ల చిత్రపటాలతో విద్యుద్దీకరణ

● ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

మహానంది: సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా అబ్బీపురంలో శనివారం పార్టీ పతాకా విష్కరణ అనంతరం గిరిజన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, మండల కార్యదర్శి సామేలు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు గ్రామ సర్పంచ్ శవ్వా శ్రీలక్ష్మి, టీడీపీ అధ్యక్షుడు ఉల్లి మధు, రైతు సంఘం నాయకులు సోమన్నల ఆధ్వర్యంలో బహుమతులు అందించారు.



పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

● బేయర్ ఆధ్వర్యంలో..

బండిఆత్మకూరు: మండల పరిధిలోని సింగవరం గ్రామంలో శనివారం బేయర్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బేయర్ కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర, ఫీల్డ్ ఆఫీసర్ శివ తదితరులు పాల్గొన్నారు.



స్కూల్‌లో పిల్లలను ఆశీర్వదిస్తున్న యాజమాన్యం, ఉపాధ్యాయులు

● పల్లెసంస్కృతికి అద్దంపట్టేలా..

నందికొట్కూరు: పట్టణంలోని శ్లోక స్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకు శనివారం తెలుగు సంప్రదాయాలను గుర్తు చేస్తూ విద్యార్థులు వేసిన వివిధ వేషధారణలు అలరించాయి. గొబ్బెమ్మలు పెట్టి కూరగాయలతో, వివిధ రకాలతో రంగవల్లులుతో ముగ్గులను తీర్చిదిద్దారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్స్ కవితారెడ్డి, శ్రీదేవిరెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు పండుగ సంబరాలు

ఆత్మకూరు: పట్టణంలోని జి.పుల్లారెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సాయిప్రణీత్ ప్రారంభించారు. ముగ్గుల పోటీల్ల గౌతమ్ హైస్కూల్, పుల్లారెడ్డి స్కూల్ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి స్కూల్ హెచ్ఎం చాంద్‌బాషా, గౌతమ్ స్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయినులకు బహుమతులను అందజేస్తున్న యాజమాన్యం

13న ముగ్గుల పోటీలు

పాములపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక చౌడేశ్వరీ దేవి ఆలయం ఆవరణంలో ఈనెల 13న మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మురళీమోహన్ శనివారం తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి సంక్రాంతి ఉత్సవాలు

మహానంది: ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో శనివారం వైదిక కమిటీ సభ్యులు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దన శర్మ, ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డిలతో ఉత్సవాలపై చర్చించారు. 13న భోగి మంటలతో ఉత్సవాలు ప్రారంభించి, అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు చిన్నారులకు భోగిపళ్ల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 14న కామేశ్వరీదేవి, మహానందీశ్వర దంపతులకు ప్రత్యేక అభిషేకార్చనలు, ఉత్సవరులకు తిరుమంజనం, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల పూజలు చేస్తామన్నారు. 15న గోవులకు ప్రత్యేక పూజలు, సాయంత్రం మహానంది గ్రామంలో పారువేట ఉత్సవం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.



ఉత్సవాల వివరాలు వెల్లడిస్తున్న ఈఓ, పండితులు

కొలిక్కివచ్చిన లక్ష్మాపురం షరాఫ్ పంచాయితీ



ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ బయట ఉన్న వైఎస్సార్‌సీపీ వర్గీయులు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం గ్రామ షరాఫ్ పెద్దమనుషుల పంచాయితీ శనివారం ఓ కొలిక్కి వచ్చింది. ఈనెల 2న అధికార పార్టీ వర్గంలోని ఎమ్మెల్యే, ఎంపీ వర్గీయులే గ్రామ పెద్దలుగా ఏర్పడి షరాఫ్ వేలం నిర్వహించిన సంగతి విదితమే. అధికార పార్టీ గ్రామ నాయకులు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులకు పెద్ద మనుషులుగా ఉండేందుకు ససేమిరా అనడంతో తాము కూడా రైతులమేనని తమ పొలాల్లో పండిన ధాన్యాన్ని తామే సపరేట్ కాటాతో విక్రయించుకుంటామని వారం క్రితం కొత్త కాటాతో విక్రయాలు ప్రారంభించారు. తమ మాట చెల్లుబాటు కాలేదని గుర్తించిన టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సాక్షి దినపత్రిక లక్ష్మాపురంలో ఆరని షరాఫ్ చిచ్చు శీర్షికన జనవరి 6న ప్రచురితమైంది. దీంతో ఇరువర్గాలను ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019 నుంచి 2024 వరకు అధికార పక్షంలోని ఆర్థర్, సిద్ధార్థరెడ్డి వర్గాలతోపాటు ప్రతిపక్ష పార్టీలతో మూడు భాగాలు ఏర్పాటు చేసి గ్రామ అభ్యుదయం కోసం కృషి చేశామని ఇరువర్గాలు ఒప్పుకుని రాజీపడ్డారు. అధికార పార్టీలోని ఎమ్మెల్యే వర్గీయులు, ఎంపీ వర్గీయులు ఏకాభిప్రాయానికి వచ్చి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ వర్గీయులకు కూడా మరో భాగం ఏర్పాటు చేస్తామని ఒప్పుకుని రూ.70 వేల నగదును అప్పగిస్తామని ఎస్ఐ సమక్షంలో అంగీకారం తెలపడంతో సమస్యకు శుభం కార్డు పడింది.

పశుపోషకులకు మెరుగైన సేవలు అందించాలి

పగిడ్యాల: పశుపోషకులకు మెరుగైన సేవలు అందించాలని జూపాడుబంగ్లా డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజినాయక్ ఆదేశించారు. శనివారం నెహ్రూనగర్ పశు గణాభివృద్ధి వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. డైరీ యూనిట్లు స్థాపించుకునే వారు సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద నిర్మిస్తున్న గోకులం షెడ్లను పశుపోషకులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుతం మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేసుకునేలా పర్యవేక్షించి ప్రగతి నివేదికలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఎల్ఓ శ్రీనివాసులు, ఓఎస్ రాజశేఖర్ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ రామాంజినాయక్

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు చేయినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు, విజయవాడ స్పెషల్ టీమ్, ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ పద్మనాభం, పోలీసులు శ్వేత, సుధీర్‌కుమార్, శివన్న, మధుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి దంపతులకు ద్వాదశి పూజలు

మహానంది: శివకేశవులకు నిలయమైన మహానందిలో కొలువైన సీతారాముల వారికి ధనుర్మాసం, ద్వాదశి పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండరామాలయంలోని మూలమూర్తులతోపాటు ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. హనుమద్వాహనంపై కొలువైన సీతమ్మ, రామయ్యలకు ప్రత్యేక అభిషేకం, మహామంగళ హారతులు చేపట్టారు.

కమనీయం.. కల్యాణం

మహానందీశ్వరుడి దంపతులకు శనివారం కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతశర్మ అలంకార మండపంలో కొలువైన స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి వేదోక్తంగా పూజలు చేశారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణతో మేళతాళాల మధ్య కల్యాణ క్రతువును ముగించారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: స్వయం ఉపాధి రుణాల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ వర్గాలకు చిన్న తరహా వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించనున్నామన్నారు. బీసీలకు 55, ఈబీసీలకు 2, ఆర్య వైశ్య కార్పొరేషన్ 1, బ్రాహ్మణ కార్పొరేషన్ 1 చొప్పున మండలానికి మంజరయ్యాయమన్నారు. 21 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు వారు అర్హులన్నారు. ఈనెల 16 నుంచి రేషన్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

15న గో పూజ

మిడుతూరు: స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఈనెల 15న గో పూజ, ధార్మిక ప్రవచనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తిరుమల, తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఆల యంలో కార్యక్రమం బ్యానర్‌ను ఆవిష్కరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మిడుతూరు: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ ఓబులేసు సూచించారు. శనివారం వీరబ్రహ్మేంద్రసామి ఆలయం వద్ద వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్సవ కమిటీ నియామకం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామి తిరుణాల సందర్భంగా ఉత్సవ కమిటీని నియమించినట్లు ఆలయ ఈఓ కార్తీక్ శనివారం తెలిపారు. ఈనెల 13 నుంచి 16 వరకు ఉత్సవాలు ఉంటాయన్నారు. నిర్వహణ కోసం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు కమిటీని నియమించామన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌గా జయమ్మ, వైస్ చైర్మన్‌గా రామల్లకోట మల్లికార్జున రెడ్డి, కమిటీ సభ్యులుగా సీతా శివరాములు, సుగాలి దేవిబాయి, గూడెం చిన్న పుల్లయ్య, మద్దుల బ్రహ్మానందరెడ్డి, జనపాల వెంకటరమణ, మీనుగ వెంకటరమణలను నియమించినట్లు తెలిపారు.



పండగ పూట.. వలసబాట

ఒకవైపు పండుగలకు బంధువులు ఇళ్లకు వస్తున్న వేళ.. మరోవైపు ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం గ్రామాలకు చేరుకుంటుంటున్న తరుణం.. లక్ష్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన 20 కుటుంబాలు మాత్రం శనివారం పొట్ట చేతబట్టుకుని ఊరునొదిలి పోతున్నారు. పండగ పూట వస్తులుండలేక కలో.. గంజో తాగి కడుపు నింపుకునేందుకు కాస్త వలస బాట పట్టారు. సంక్రాంతి మరో రెండు రోజులుండగా కాంతిని వెతుక్కుంటూ మూటాముల్లె సర్దుకుని ప్రకాశం జిల్లా గూడూరు గ్రామానికి పండు మిర్చి తెంపడానికి ఆల్విన్ వాహనంలో బయలుదేరి వెళ్లారు. నవ్వుతూ వెళ్లొస్తామని చెబుతున్నా.. లోలోన మదన పడుతూ గుండె భారాన్ని భరిస్తూ ఇలా వెళ్లడం పలువురిని కలచివేసింది. – పగిడ్యాల

మహానందీశ్వరుడి సన్నిధిలో న్యాయమూర్తి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కాకినాడ వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి చెరుకూరి వసంత కుమార్ కుటుంబ సభ్యులు శనివారం రాత్రి పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం అనంతరం వారికి వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.



వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న న్యాయమూర్తి వసంత్‌కుమార్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన అమృతాసింగ్, బృందం సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వినాయకకౌత్వం, గణేశపంచరత్నం, శివ శివశంకరా, ఓంకారనాదం, అఖిలాండేశ్వరి, అంబాపరమేశ్వరి తదితర గీతాలకు విద్యశ్రీ, గగన, క్షేత్ర, అనంతిక, శ్రావణి, ప్రతిక్ష, ప్రజ్ఞ, ఆరాధ్య, అక్షర, అద్వైత తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

ప్రాతకోటలో తిరుణాల సందడి





తూర్పు ప్రాతకోట నాగేశ్వరస్వామి ఆలయం, పడమర ప్రాతకోట నందీశ్వర, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

పగిడ్యాల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే తూర్పు, పడమర ప్రాతకోట పార్వతీ నాగేశ్వరస్వామి, నందీశ్వర, కాశీవిశ్వేశ్వర స్వామి తిరుణాల వేడుకల సందడి ప్రారంభమైంది. కార్య నిర్వాహక కమిటీ సభ్యులు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు యాగశాలకు కావాల్సిన చలువ పందిర్ల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రేపటి నుంచి తూర్పు ప్రాతకోట నాగేశ్వరస్వామి దేవాలయం వద్ద హోమములు నిర్వహిస్తున్నట్లు బీజేపీ శంకరరెడ్డి వెల్లడించారు. ఈ హోమములు ఈనెల 17వ తేదీ వరకు నిర్విరామంగా కొనసాగుతాయన్నారు. రూ.25 లక్షల వ్యయంతో నూతన రథోత్సవం, 16 లక్షల వ్యయంతో రథశాలను నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. నూతన రథోత్సవం ప్రపంచ స్థాయి విశిష్టతను కలిగి ఉందని 8 గజ వాహనాలు, ఇద్దరూ వినాయకులు, పన్నెండు జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలు, ఇద్దరూ పార్వతీపరమేశ్వరుడు, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, అష్టదిక్పాలకులు, నాలుగు ఏనుగులు, నాలుగు గుర్రాలు, నాలుగు సింహాలు, 8 చిన్న గుర్రాలు, ఇద్దరు నటరాజులు, నాలుగు నందులు, ఇద్దరు అమ్మవారు ప్రతిమలతో నిర్మితమైన నూతన రథోత్సవం కలుషంతో కలిపి 27 అడుగుల ఎత్తు ఉందని వివరించారు. గణపురం సుబ్రమణ్య ఆచారి, ఎర్రమఠం నాగరత్నం ఆచారి ఏడాది పాటు శ్రమించి అత్యద్భుతంగా రూపొందించారని తీర్థ యాత్రలకు వెళ్లాల్సిన అవసరం లేదని ఈ రథాన్ని సందర్శిస్తే చాలని నాగేశ్వరస్వామి రథోత్సవ మహిమను వెల్లడి చేశారు. 13న పెళ్లి కొడుకు, 14న కళ్యాణం, 15న రథోత్సవం, 16న పారువేట, 17న వసంతోత్సవం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.



పడమర ప్రాతకోటలో వెలసిన బ్రేక్ డ్యాన్స్, జాయింట్ వీల్ ఉయ్యాలలు

పాడి రైతుల శ్రేయస్సు ధ్యేయం

● ఎమ్మెల్యే గిత్త జయసూర్య

మిడుతూరు: పాడి రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. శనివారం మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు కాతా రమేష్‌రెడ్డి, సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ నాగస్వామిరెడ్డి, ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

వడ్డె ఓబన్న వీరత్వం చిరస్మరణీయం



జూపాడుబంగ్లా: వడ్డె ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆత్మకూరు: వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేనాధ్యక్షునిగా ఉంటూ దేశం నుంచి బ్రిటీషువారిని తరిమేయడంలో వీరోచితంగా పోరాడి ప్రాణాలు విడిచిన వడ్డె ఓబన్న వీరత్వం చిరస్మరణీయమని తరిగోపుల మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి అన్నారు. వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకుని తరిగోపుల గ్రామంలోని వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

ఆత్మకూరు: స్థానిక వడ్డె పేటలో శనివారం వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. అఖిల భారత వడ్డె ఓబన్న సేవాసమితి పట్టణ అధ్యక్షులు చంద్రగిరి మల్లికార్జున, నాయకులు సంపంగి ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవాసమితి నాయకులు సంపంగి కృష్ణ, సంపంగి దర్గయ్య, మల్లికార్జున, చంద్రగిరి, దుర్గరాజు, పెద్దరాజు, శివ, హరికృష్ణ, సుబ్బరాజు, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, వెంకటరమణ, రాధ, దానమ్మ, శోభ, బాలమ్మ పాల్గొన్నారు.